క్లుప్తంగా

దివ్యాంగులకు బస్‌పాస్‌లు

దుమ్ముగూడెం: ప్రజల వద్దకు ఆర్టీసీలో భాగంగా సురక్షితమైన ప్రయాణం కోసం ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని భద్రాచలం డిపో మేనేజర్ వి.రామారావు కోరారు. మంగళవారం లక్ష్మీనగరం గ్రామంలో దివ్యాంగులకు ఉచిత బస్ పాస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులందరూ సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ జిరాక్స్, పాస్ ఫోటో, ఆన్‌లైన్ ఫీజ్ రూ.50 చెల్లించి సబ్సిడీతో కూడిన ఉచిత బస్‌పాస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 3రోజుల పాటు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

20న ఇఫ్తార్ విందు

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గంలోని ముస్లింలకు ప్రభుత్వం తరపున ఈనెల 20న ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి షేక్ అన్వర్ తెలిపారు. స్థానిక ముస్లిం మైనార్టీ మిల్లత్ కమిటీ కార్యాలయంలో మంగళవారం ఆయన మతపెద్దలతో సమావేశమై మాట్లాడారు. మత పెద్దలు యూసఫ్ షరీఫ్, జావీద్ పాషా, హబీబ్, బాబుజానీ, రహీం, ఇస్మాయిల్, సిరాజ్, ముస్తఫా, నూరుద్దీన్ పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు

గుండాల: మండల కేంద్రలో నవ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో బొడ్రాయి సెంటర్, గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన చలి కేంద్రాలను ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మండలోజు వినయ్, కొండేటి సంతోష్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సీతారాములు, ఆజాద్, కోరం శాంతయ్య, గుంపిడి వెంకటేశ్వర్లు, కొడెం వెంకటేశ్వర్లు, గోపి, బచ్చల రామయ్య, సాహెబ్, సారయ్య ,రాజు, మంగయ్య, ఉపేందర్, అజ్గర్, శేషు, అశోక్, సంతోష్, పాల్గొన్నారు.

రాయితీ రుణాలు ఇవ్వాలి

అశ్వాపురం: నాయీ బ్రాహ్మణ సహకార సంఘాలకు ప్రభుత్వం వెంటనే రాయితీ రుణాలు ఇవ్వాలని నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమూల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఎస్‌కేటీ ఫంక్షన్ హాల్‌లో నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కమిటీ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. జిల్లా కమిటీ సమావేశంలో నాయీ బ్రాహ్మణుల సమస్యలపై పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తూముల సదానందం, వర్కింగ్ ప్రెసిడెంట్ అరసవల్లి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు తోటపల్లి మాదవరావు, మల్లేష్, శ్రీనివాసరావు, 23 మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

మణుగూరురూరల్: మండల పరిధిలోని విజయనగరం గ్రామంలో ఉన్న శ్రీసమ్మక్క -సారలమ్మ దేవాలయ ప్రాంగణంలో పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఆదేశాల మేరకు ఈ నెల 20వ తేదీన నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహరావు కోరారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని విఠల్‌రావునగర్, కోటకట్ట, కొత్తకొండాపురం, శివలింగాపురం, బాపన కుంట తదితర ప్రాంతాల్లో ఆయన జన సమీకరణ కోసం పర్యటించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అడపా అప్పారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.నవీన్, నాయకులు యాదగిరిగౌడ్, హరిప్రసాద్, నరసింహరావు, రమణ పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలి

దుమ్ముగూడెం: ఉపాధి హామీకూలీలకు వారం వారం వేతనాల బిల్లు చెల్లించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథ మండల కార్యదర్శి సాయన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పైడిగూడెం గ్రామం చెరువులో పనిచేస్తున్న గ్రామీణ ఉపాధి హామీ కూలీలను ఆయన పలకరించారు. ఈ సందర్భంగా కూలీలు నాలుగు వారాలు పని చేశామని, ఒక వారం డబ్బులు కూడా పడలేదని తెలుపారు. ఈ సందర్భంగా సాయన్న మాట్లాడుతూ.. ఏ వారానికి ఆ వారం బిల్లులు చెల్లించాలని, వేసవి దృష్ట్య అన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాగరాజు,కంగాల గంగరాజు, కంగాల లక్ష్మయ్య, కురసం గంగయ్య, కురసం రామారావు, కంగాల పుల్లమ్మ, గంగాల కాంతమ్మ,రామక్క, గడ్డం వెంకటమ్మ పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ

భద్రాచలంఅర్బన్: సుచిర్ ఇండియా టాలెంట్ టెస్టులో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటినట్లు పట్టణంలో త్రివేణి స్కూల్ ప్రిన్సిపల్ జంగాల మంజుల వెల్లడించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆమె మాట్లాడుతూ.. మూడో తరగతి విద్యార్థులు ఎ.అక్షయ్, ఎస్.శ్రీకార్తికేయలు వరుసగా మొదటి, రెండో బహుమతులను సాధించినట్లు, ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి సుచిర్ ఇండియా యాజమాన్యం మెమెంటో, సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను వైస్ ప్రిన్సిపల్ కాను మిల్లి విమలాదేవి, అడ్మిస్ట్రేటివ్ ఆఫీసర్ బాబురావు, క్యాంపస్ ఇన్‌చార్జ్ సందీప్ రెడ్డి, తోటి అధ్యాపక బృందం, విద్యార్థినీ, విద్యార్థులు అభినందించారు.

యథేచ్ఛగా అక్రమ రవాణా

- అర్ధరాత్రి ట్రాక్టర్లతో ఇసుక తోలకాలు
- సుదూర ప్రాంతాలకు తరలింపు
- గోదారి తీరాన ప్రజలకు ఇసుక కరువు
- పట్టించుకోని అధికారులు



యంత్రాలతో గోదావరిలో ఇసుక తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని గోదావరి తీరంలో కొందరు అక్రమమార్కులు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఇసుక క్వారీల నుంచి కాకుండా ఇతర ప్రాంతాల మణుగూరులోని ఇసుక ట్రాక్టర్స్ ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా అక్రమంగా ఇసుక తోలకాలు చేపడుతున్నారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని రాయిగూడెం గ్రామ సమీపంలోని అక్రమంగా ఏర్పాటు చేసుకున్న క్వారీలో నుంచి కొందరు అక్రమార్కులు ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేయడం జరుగుతుంది. ప్రతి రోజూ అర్ధరాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా తోలుకాలు చేపడుతుంటారు. అటువంటి సమయంలో వారికి ఎవరు అడ్డొచ్చినా ఎం చేయడానికైనా సిద్ధంగా ఉంటున్నారు. స్థానిక ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని వారు ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిస్తున్నారు. గోదావరి తీరంలో ఉన్న గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం ఇక్కడ ఇసుక కరువవుతోంది. మణుగూరు గోదావరి ఇసుక క్వారీల నుంచి హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు ఇసుక రవాణా అవుతున్నప్పటికీ ఇక్కడ నిర్మాణాలు చేసుకొనే వారికి మాత్రం ఇసుక కరువు అన్నట్లు ట్రాక్టర్ యజమానులు చేస్తున్నారు. వారు చెప్పిన ధరలకు మాత్రమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేయడం జరుగుతుంది. కొంత మంది ఇసుక అక్రమంగా తీసుకొచ్చి నిలువ చేసుకొని ఇతర ప్రాంతాలకు అక్రమంగా లారీల ద్వారా తరలిస్తున్నారు.

సెలవులు వస్తే అంతే..

మణుగూరులో గోదావరి తీరం నుంచి అక్రమంగా ఇసుక తోలకాలపై రెవెన్యూ పోలీసు అధికారులెవరూ పట్టించుకోకపోవడం లేదు. దీంతో అక్రమదారులకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. రాత్రి పగలు అనే తేడా లేకుండా సెలవు దినాల్లో అక్రమ తోలకాలు జరుగుతున్నాయి. సెలవురోజుల్లో అధికారులు ఎవరూ అందుబాటులో లేని సమయాల్లో అక్రమణ దారులు ఇష్టానుసారంగా తోలకాలు చేపడుతుంటారు. ఈవిదంగా అక్రమ తోలకాలు చేపట్టడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇసుక సీనరేజీలు ఏర్పాటు చేయడం వల్ల సంబంధిత మున్సిపాలిటీలకు గాని పంచాయతీలకు కాని కొంత ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయి.

అందరికీ మామూళ్లు..

ప్రభుత్వానికి ఎటువంటి పన్నులు చెల్లించకుండానే గోదావరిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న అక్రమవ్యాపారులు తాము అందరికీ మామూళ్లు ఇస్తున్నామంటూ ప్రచారం చేస్తున్నారు. ఆ మాట చెప్పి అధిక ధరలకు ఇసుక అమ్మకాలు చేపడుతున్నారు. గతంలో స్థానికంగా కేవలం రూ.1 వెయ్యి నుంచి రూ.12 వందల వరకు అమ్మకాలు చేస్తామని చెప్పిన ట్రాక్టర్ యజమానులు ప్రస్తుతం రూ.15వందల నుంచి 2వేల వరకు అమ్ముతున్నారు. గొదావరిలో యంత్రాలు పెట్టి మరి తోలకాలు చేపడుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే పోలీసు రెవిన్యూ అధికారులకు నెలనెలా మామూళ్ళు అందిస్తున్నామంటూ బుకాయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ విధమైన అక్రమ ఇసుక దందాకు తెరదించాలని, ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మితిమీరుతున్న ఆగడాలు



ట్రాక్టర్ యజమానులు చేస్తున్న అగడాలు అంతా ఇంతా కాదు. రాత్రి వేళ ఇష్టానుసారంగా ట్రాక్టర్లను గ్రామాల మీదనుంచి పోతున్నాయి. దీంతో గ్రామంలో రోడ్లు పూర్తిగా పాడైపోతున్నాయి. కమలాపురంలోని ప్రధాన రహదారి పూర్తిగా ఇసుక ట్రాక్టర్స్ వల్లనే పాడైపోతోంది. ప్రశ్నించేవారిపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. అక్రమ వ్యాపారులకు అధికారులు అండదండలు పుష్కలంగా ఉండటంతో వారి ఇష్టారాజ్యంగా చేస్తున్నారు.

– రావులపల్లి రాంమూర్తి, కమలాపురం

అధిక ధరకు అమ్ముతున్నారు



గోదావరి తీరం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ ప్రజలకు అధిక ధరలకు అమ్ముతున్నారు. గోదావరి నుంచి అక్రమ రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ప్రజలపై భారం పడుతోంది. ఇసుక ధరలు అధికంగా ఉండటం వల్ల భవన నిర్మాణాలు సైతం తగ్గుతున్నాయి. దీంతో కార్మికులకు సైతం ఇబ్బందిగా మారుతోంది. అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలి.

– ఉప్పుతల నర్సింహారావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, మణుగూరు

ముమ్మరంగా మలేరియా సర్వే



చంద్రుగొండ: ఆదివాసీల నుంచి రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం, గుమ్మడవల్లి పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం కూడా అసింప్టోమిక్ జ్వర సర్వే కొనసాగింది. ఆయా పీహెచ్‌సీల వైద్యుల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆర్‌డీటీ నిర్వహించారు. తిరుమలకుంట కాలనీ గ్రామంలో 179 మందికి రేగళ్ల గొత్తికోయల గ్రామంలో 122 మందికి మలేరియా పరీక్షలు నిర్వహించారు. మలేరియా కేసులు నమోదు కాలేదు. కాగా దట్టమైన అటవీ ప్రాంతంలోని రేగళ్ల గొత్తికోయల గ్రామానికి వైద్య సిబ్బంది ద్విచక్రవాహనాలపై వెళ్లి మలేరియా పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాందాస్ నాయక్, హెచ్ఈఓ శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, ఎంటీఎస్ విజయ్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, భాస్కర్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలంలోని బెండాలపాడు శివారు ఎర్రబోడులో నివాసముంటున్న గొత్తికోయ ఆదివాసీలకు చంద్రుగొండ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక ఫీవర్‌సర్వే నిర్వహించారు. 107 మంది ఆదివాసీల రక్తనమూనాలను సేకరించినట్లు డాక్టర్ కనకం తనుజా తెలిపారు. ఎసింటమాటిక్ జ్వరసర్వేతోపాటు ర్యాపిడ్ డయాగ్నస్టిక్ పరీక్షలు చేశామన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది కుమారస్వామి, యండి.ఇమాం, శ్రీనివాసరావు, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఎంపీడీఓ, కోఆప్షన్ సభ్యుడి నడుమ వాగ్వాదం

అశ్వారావుపేటరూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో, స్థానిక కోఆప్షన్ సభ్యుడి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి అధ్యక్షత ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి స్థానిక తహసీల్దార్‌తోపాటు పలు శాఖల అధికారులు హాజరు కాకుండా, వారి కింది స్థాయి సిబ్బందిని పంపించారు. ఇదే విషయంపై మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కె.పాషా రెవిన్యూ శాఖలో అనేక సమస్యలు ఉన్నాయని, తహసీల్దార్ హాజరు కాకపోతే ఏలా అని ప్రశ్నించారు. దాంతో ఎంపీడీఓ విద్యాధరరావు కల్పించుకుని సర్వసభ్య సమావేశంలో చాలా మంది ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఉండగా, వారు కల్పించుకోని విషయాలు ప్రతి సారీ మీరే మాట్లాడుతుంటారని అసహనం వ్యక్తం చేశారు. దాంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఎంపీడీఓ తీరుపై మిగిలిన ప్రజాప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆయన వెనక్కి తగ్గారు. ఆపై పంచాయతీకి నిధులు ఇవ్వకపోవడంపై తలెత్తుతున్న సమస్యలపై ప్రజాప్రతినిధులు చర్చించారు. సమావేశంలో పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

20న ఉపాధ్యాయులతో ముఖాముఖి



సమావేశంలో మాట్లాడుతున్న మురళీమోహన్

చర్ల: ఈ నెల 20న చర్లకు రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలపై ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.మురళీమోహన్ పేర్కొన్నారు. మంగళవారం చర్లలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్లలోని రైతు వేదికలో మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఉపాధ్యాయులతో ముఖాముఖీ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులంతా హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి ఉయికా బాలకృష్ణ, సహాయ కార్యదర్శులు ఎస్.బాలకృష్ణ, పి.రాధ, సీనియర్ నాయకులు పి.నర్సింహారావు, ఏ.శ్రీనివాసరావు, పీవీ రమణ, ఈ.వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అశ్వాపురం: మండల పరిధిలోని అమ్మగారిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధురాలు సూర్జిశ కిడ్నీ, మూత్రపిండాల వ్యాధితో అనారోగ్యంతో బాధపడుతుండటంతో వైద్య ఖర్చులకు భారజల కర్మాగారం గౌతమీస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కె.సోమయ్య, ఇ.నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలను కలిసిన నాయకులు

దమ్మపేట: బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా ఎన్నికైన ఉపాధ్యాయుల సూర్యప్రకాశరావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం తుమ్మలను గండుగులపల్లి గ్రామంలోని ఆయన నివాసంలో కలవగా.. సూర్యప్రకాశరావును ఆయన అభినందించి, శాలువాతో సత్కరించారు. పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి, రాబోయే ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్‌ను, స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తుమ్మల కోరారు.

దాడులను అరికట్టాలి

భద్రాచలంఅర్బన్: మహిళలపై పెరుగుతున్న దాడులు అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని ఐద్వా పట్టణ కార్యదర్శి డి.సీతాలక్ష్మి ఆరోపించారు. మంగళవారం ఐద్వా పట్టణ కమిటీ సమావేశం పుస్తెల జ్యోతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సీతాలక్ష్మి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన 8 సంవత్సరాల కాలంలో మహిళలపై అత్యాచారాలు, లైంగిక దాడులు విపరీతంగా పెరిగాయని అన్నారు. కేంద్రం పెంచిన వంట గ్యాస్ ధరలు వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ఆఫీస్ బేరర్ నాదెళ్ల లీలావతి, జిల్లా కమిటీ సభ్యురాలు జీవనజ్యోతి, కమిటీ సభ్యులు గంగా, రాధా, వనమ్మ, రమణ, నాగలక్ష్మి, లక్ష్మీకాంత, పుణ్యావతి, సుశీల, మడెం లక్ష్మి, దామని పాల్గొన్నారు.

జలగం జన్మదిన వేడుకలు

దమ్మపేట: కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం దమ్మపేట గ్రామంలో జలగం అభిమానులు, నాయకులు కేక్ కట్ చేసి, ఒకరికొకరు తినిపించుకున్నారు. మిఠాయిలు పంచారు. చెలికాని సూర్యారావు, రావుల శ్రీను, చిన్నశెట్టి సత్యనారాయణ, పగడాల రాంబాబు, రామకృష్ణ, శిఖర్, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు



అశ్వారావుపేట: ధాన్యం కేంద్రాన్ని ప్రారంభించిన జెడ్పీటీసీ వరలక్ష్మి

అశ్వారావుపేటరూరల్: రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని, దళారులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవద్దని జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నంశెట్టి వరలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని నారాయణపురం సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ డైరెక్టర్, సొసైటీ చైర్మన్ నిర్మల పుల్లారావుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధాన్యాన్ని విక్రయించే సమయంలో రైతులు ప్రభుత్వం విధించిన నిబంధనలును పాటించాలని సూచించారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంగాల పరమేష్, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

అన్నపురెడ్డిపల్లి: ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను స్థానిక ఎమ్మెల్యే మెచ్చానాగేశ్వరరావు ఆదేశించారు. మండలంలోని రాజాపురం గ్రామంలో గుంపెన పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. తొలిత అన్నపురెడ్డిపల్లిలోని రైతు వేదిక వద్ద కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, రంజాన్ తోఫా అందజేశారు. ఎమ్మెల్యే మెచ్చాను వీఓఏలు కలిసి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భారత లాలమ్మ, ఎంపీపీ సున్నం లలిత, వైస్ ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు, గుంపెన పీఏసీఎస్ చైర్మన్ బోయినపల్లి సుధాకర్, తహసీల్దార్ భద్రకాళి, ఎంపీడీఓ రేవతి, సర్పంచ్ బోడా పద్మ, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు భీంరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: రైతులకు మద్దతు ధర అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సూచించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడారు. తొలుత స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా అందజేశారు. కాగా ముందస్తు సమాచారం లేకపోవడంతో జగన్నాథపురంకు చెందిన మసీదు కమిటీ సభ్యులు కార్యక్రమానికి గైర్హాజరు కావడం గమనార్హం. తహసీల్దార్ శేషగిరిరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ నడిపల్లి సునంద, రైతు సమన్వయసమితి జిల్లా అధ్యక్షుడు రావు గంగాధరరావు, ఏడీఏ అజ్జల్ బేగం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, ఎంపీటీసీ శనగపాటి మోహరమణి, పువ్వాల మంగపతి, సీతారాములు, చందర్‌రావు, సీపీఐ జిల్లా నాయకులు నరాటి ప్రసాద్, సర్పంచ్‌లు, ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పినపాక: మండల పరిధిలోని గోపాలరావుపేట గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ గుమ్మడి గాంధీ మంగళవారం ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, పండించిన ప్రతి గింజా ప్రభుత్వం వద్ద అమ్ముకుని లాభాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రవి శేఖర్ వర్మ, వ్యవసాయ శాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు అవగాహన

చంద్రుగొండ: బూత్‌లెవల్ అధికారులకు డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న మంగళవారం కార్యాలయంలో ఓటర్ల నమోదు ప్రక్రియలోని నూతన విధానంపై అవగాహన కల్పించారు. గతంలో ఉన్న గరుడ యాప్ స్థానంలో బీఎల్వో యాప్ రూపొందించినట్లు వివరించారు. ఓటర్ల నమోదు, తప్పులను సరిచేసే విధానంపై బీఎల్ఓలకు అవగాహన కల్పించారు.

బదిలీలు చేపట్టాలి

గుండాల: అనివార్య కారణాల వల్ల ఆలస్యమవుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ప్రభుత్వం చొరవ తీసుకుని వెంటనే చేపట్టాలని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భూక్యా రమేష్, ఆళ్లపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇస్లావత్ నరేష్, ఆంగోత్ రమేష్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు పది సంవత్సరాలుగా ఒకే చోట పనిచేస్తున్నారని, దీనివల్ల ఆ ప్రాంతమే వారి నివాస స్థలంగా మారే పరిస్థితులు వచ్చాయని అన్నారు. ప్రతీ పాఠశాలకు స్వీపర్ పోస్టును మంజూరు చేయాలని, గురుకులాల్లో, కేజీబీవీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు పెంచిన బేసిక్ పేను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ, ఏహెచ్‌ఆర్ఏ, ఎస్సీఏతో ఈఎల్ఎస్‌లను మంజూరు చేయాలన్నారు.

వీఓఏలకు పలువురి సంఘీభావం



అశ్వాపురం: వీఓఏలకు సంఘీభావం తెలుపుతున్న ఎంపీపీ సుజాత, కాంగ్రెస్ నాయకులు

అశ్వాపురం: వీఓఏల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ ముత్తినేని సుజాత డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఐకేపీ వీఓఏల రెండో రోజు నిరసన దీక్షకు మంగళవారం ఎంపీపీ ముత్తినేని సుజాత, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

గుండాల: ఆళ్లపల్లి మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మెకు సీపీఐఎంఎల్ మంగళవారం మద్దతు తెలిపింది. సమ్మె శిబిరాన్ని ఆ పార్టీ జిల్లా నాయకుడు, ఆళ్లపల్లి వైఎస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య సందర్శించి మాట్లాడారు. వీఓఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

చంద్రుగొండ: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఓఏలు చేపట్టిన ఆందోళనకు జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి సంఘీభావం తెలిపారు. మంగళవారం దీక్షాశిబిరాన్ని సందర్శించి ఆయన మాట్లాడారు. ఆందోళనకు సంఘీభావం తెలిపిన వారిలో కాంగ్రెస్ నాయకులు కేశబోయిన నర్సింహారావు, దారావత్ రామారావు, మచ్చా కుమార్, సీహెచ్ రాములు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అశ్వారావుపేటరూరల్: న్యాయమైన తమ డిమాండ్లను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని వీవోఏ మండల అధ్యక్షురాలు ఎస్‌కే షాహిన్ కోరారు. స్థానిక పాత ఎంపీడీఓ ఆఫీస్ వద్ద నిర్వహిస్తున్న వీవోఏ సమ్మె మంగళవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో జయలక్ష్మి, బేబి, శివ కుమారి, బుజ్జి, దుర్గా భవాని, పార్వతి, సువార్త, కల్యాణి పాల్గొన్నారు.

మణుగూరురూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వీవోఏల సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరింది. డిమాండ్లను పరిష్కరించేంత వరకు సమ్మెను విరమించేది లేదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సమ్మెలో వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు సులోచన, కార్యదర్శి శ్రీనుగోపాల్, కోశాధికారి రమేష్, ప్రవంతి, రాము, ధనలక్ష్మి, లలిత, లీల, వెంకటలక్ష్మి, అరుణ, వీవోఏలు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా అందజేత



అశ్వారావుపేట: కొత్తూరు మసీదుకు వితరణ చేస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



అశ్వారావుపేటరూరల్: రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందించిన రంజాన్ తోఫా కానుకలను మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ముస్లింలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, వైస్ ఎంపీపీ చిట్లూరి ఫణీంద్ర, డీటీ సుచరిత, కోఆప్షన్ సభ్యులు ఎస్‌కె.పాషా, బీఆర్ఎస్ నాయకులు బండి పుల్లారావు, మందపాటి మోహన్‌రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు, సత్యవరపు సంపూర్ణ, తాడేపల్లి రవి, యూఎస్ ప్రకాశ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం, దేశానికే తలమానికం అని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం తహసీల్‌లో స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి ముస్లిం సోదరులకు రంజాను తోఫాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సంక్షేమ పాలనకే రాబోయే ఎన్నికల్లో పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు దారా యుగంధర్, కొయ్యల అచ్యుతరావు, జలగం వాసు, సైదా, యార్లగడ్డ బాబు, పగడాల రాంబాబు, జిన్నా, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: ముస్లిం మైనారిటీలకు టీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ఈ దిశగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. స్థానిక రైతువేదికలో మంగళవారం రంజాన్ పండుగను పురస్కరించుకుని పేద ముస్లింలకు ప్రభుత్వం సరఫరా చేసిన ఈద్‌తోఫా దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీపీ బాణోత్ పార్వతి, ఎంపీటీసీలు దార వెంకటేశ్వరరావు, లంకా విజయలక్ష్మి, మసీద్ కమిటీల అధ్యక్షుడు యండి.షమీహుసేన్, యండి.షబ్బీర్‌హుసేన్, యండి.రవూఫ్, యండి.నాబీద్‌హుసేన్, ఎస్డీ రసూల్ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సుఖ సంతోషాలతో ఉండాలి

అశ్వారావుపేట: ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక పెద్ద మసీదులో రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు మంగళవారం మాజీ ఎంపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై.. ముస్లిం సోదరులకు ఆయన చేతుల మీదుగా భోజనం వడ్డించారు. అలాగే మండలంలోని గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాల్లోగల మసీదులకు తన వంతు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు జారే ఆదినారాయణ, జూపల్లి రమేష్, ములకలపల్లి మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజీ, మాజీ ఎంపీటీసీ నండ్రు రమేష్, జూపల్లి ప్రమోద్, ముస్లిం కమిటీ బాధ్యులు ఎండి.ఆసీఫ్ అలీ, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీపీ రేగా కాళిక, తహసీల్దార్ ఉషా శారదల చేతుల మీదుగా రంజాన్ తోఫా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఊకె.రామనాథం, ఎంపీటీసీ ఎలిపెద్ది శైలజ, ఎంపీడీఓ శ్రీను, పెద రామలింగం, షేక్ సోందు పాషా పాల్గొన్నారు.

అశ్వాపురం: రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వం అందజేసిన రంజాన్ కానుక దుస్తులను మండల కేంద్రంలోని రైతువేదికలో తహసీల్దార్ ఎం ఏ.రాజు అధ్యక్షతన మండలంలోని ముస్లింలకు మంగళవారం ఎంపీపీ ముత్తినేని సుజాత, వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ మణిధర్, ఆర్ఐలు రాజేశ్వరరావు, నాగమణి, ముస్లిం మైనారిటీ మండల అధ్యక్షుడు షేక్ బషీర్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ అజీజ్, సయ్యద్ యాకూబ్‌ఆలీ, బీఆర్ఎస్ పార్టీ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు ఎస్‌కే.నయీం తదితరులు పాల్గొన్నారు.